జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
25 శుక్రవారం సెప్టెంబర్ , 2026 పేజీలు:13



02లో

రామ్ మందిర్ వినాయక హారతి పూజ లో పాల్గొన్న సర్పంచ్ హనుమంత రెడ్డి

# జూరాల నీటిపై 'వారాబందీ'

- సాగు.. తాగునీటికి ఇబ్బంది లేకుండా వినియోగం: మంత్రి జూపల్లి
- ఒక్క ఎకరం ఎండకూడదు! జూరాల నీటిని పొదుపుగా వాడాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 24 (ప్రజాజ్యోతి):**

వానాకాలం పంటలను కాపాడేందుకు జూరాలకు కృష్ణా జలాలను విడుదల చేయించినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ సాగు, తాగునీటి అవసరాలు తీర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి కలెక్టరేట్‌లో సాగు, తాగునీటి పరిస్థితిపై మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం పంటలు, తాగునీటి అవసరాలకు సుమారు 18.19 టీఎంసీల నీరు అవసరమని తెలిపారు. జూరాలలో ప్రస్తుతం ఉన్న నీటితోపాటు కర్ణాటక నుంచి వస్తున్న జలాలను కలిపి జాగ్రత్తగా వినియోగిస్తే పంటలు, తాగునీటి అవసరాలను తీర్చవచ్చున్నారు. డిస్ట్రిబ్యూటరీల వారీగా సమానంగా నీరు అందించేలా వారాబందీ విధానం అమలు చేయాలని ఆదేశించారు. లష్కర్లు, ఇతర సిబ్బందితో ఆన్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయాలని సూచించారు. వారాబందీపై వ్యవసాయ విస్తరణాధికారులకు అవగాహన కల్పించి రైతులకు వివరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో జమ్మూ, సిల్టింగ్ తొలగింపు, ఇతర మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నవంబరు 27 వరకు వారాబందీ విధానంలో నీటిని విడుదల చేస్తేనే వానాకాలం పంటలను కాపాడుకోవచ్చని, రైతులు సహకరించాలని కోరారు.

మిగతా 2 లో



## ప్రజాజ్యోతి కథనానికి స్పందన.. మట్టి పూడ్చివేత

**గండీడ్:**

రంగారెడ్డిపల్లి నుంచి దాదాపూర్ వరకు కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో కల్వర్టుల వద్ద ఏర్పడిన గుంతలతో వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ప్రజాజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.కల్వర్టులు నిర్మించిన అనంతరం వాటి వద్ద మట్టి సక్రమంగా పూడ్చకపోవడంతో లోతైన గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని ప్రజాజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మిగతా 2 లో



ప్రజాజ్యోతి

22 Sep 2026 - Page 2

రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

మొదటిపేజీ తరువాయి

# జూరాల నీటిపై 'వారాబందీ'

### సమన్వయంతో పనిచేయాలి

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. నీటి నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమాచార లోపం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, విడుదల వివరాలను ప్రతిరోజూ మీడియాకు వెల్లడించాలని ఆదేశించారు. నీటి లభ్యతకు అనుగుణంగా రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి సాగు ప్రణాళిక చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

### తుంగభద్ర జలాలపైనా దృష్టి

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ జూరాలలో నీరు ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయడం లేదనే అపోహలు రైతుల్లో ఉన్నాయని, వాస్తవ పరిస్థితులను వారికి వివరించాలని అన్నారు. ప్రస్తుతం కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయించామని, త్వరలో తుంగభద్ర జలాలను ఆర్డీఎస్‌కు విడుదల చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

### 'ఒక్క ఎకరం ఎండకూడదు'

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు సాగు చేసిన పంటల్లో ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదన్న లక్ష్యంతో కర్ణాటక ముఖ్యమంత్రితో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల బృందం చర్చించి జూరాలకు కృష్ణా జలాలు విడుదల చేయించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని అవసరమైన ప్రాంతాల్లోనే వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్‌ను సాధ్యమైనంత మేర నింపేందుకు రెండు మోటార్లను వెంటనే నడిపించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, వినోద్‌కుమార్, ఎస్పీలు సునీతారెడ్డి, శ్రీనివాసరావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ రహీముద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రజాజ్యోతి కథనానికి స్పందన.. మట్టి పూడ్చివేత



ఈ నేపథ్యంలో ఈరోజు సంబంధిత సిబ్బంది కల్వర్టుల వద్ద మట్టి వేయించి గుంతలను పూడ్చివేశారు. దీంతో వాహనదారులకు కొంత మేర ఇబ్బందులు తొలగాయి. ప్రజా సమస్యపై ప్రచురితమైన వార్తకు అధికారులు తక్షణమే స్పందించిన చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు కల్వర్టుల వద్ద మట్టి పటిష్టంగా పూడ్చడంతో పాటు, రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పాటించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'ప్రజాజ్యోతి' కథనానికి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## రామ్ మందిర్ వినాయక హారతి పూజ లో పాల్గొన్న సర్పంచ్ హనుమంత రెడ్డి

**నర్వ సెప్టెంబర్ 24 ప్రజాదౌతి**




నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని రామ్ మందిర వినాయక మండపంలో గురువారం రాత్రి జరిగిన నిత్య హారతి పూజా కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా గ్రామ సర్పంచ్, ప్రతిభ స్కూల్ల కరస్పాండెంట్ టీ హనుమంత రెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం మంగళహారతి తో ముగించారు, అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇదేవిధంగా తోడు గణపతిని అందిస్తున్న దాతలు కోళ్ల దంపతులు శ్రీమతి మీనాక్షి కోల చెన్నప్పల, తో పాటు అన్నదాన దాతలను వినాయక చవితి ఉత్సవాల అందించిన వక్తలను అభినందించి వినాయక అమౌంట్ సన్మానించారు, ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దండు అయ్యప్ప, గ్రామ ఉపసర్పంచ్ దండు అజయ్, గణేశు ఉత్సవ కమిటీ సభ్యులు ఆర్యన్ గ్రూపు యువకులు తదితరులు పాల్గొన్నారు

# వన్యమృగం సంచారంపై ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అత్యవసర స్పందన

### అటవీ అధికారులకు లేఖ.. బాధిత రైతులకు పరిహారం, ప్రత్యేక వైల్డ్‌లైఫ్ టీమ్‌లతో నిఘా

**గండీడ్, సెప్టెంబరు 24 (ప్రజా జ్యోతి)**



: గండీడ్ మండలం కొండాపూర్ అటవీ ప్రాంతం, చంద్రయనిగుట్ట, మన్సూర్‌పల్లి పరిసరాల్లో వన్యమృగం (చిరుత/పులి) సంచరిస్తూ పశువులు, ఇతర మూగజీవాలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో రైతులు, స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ఇప్పటికే పది మందికి పైగా మూగజీవాలపై దాడులు జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతూ అటవీశాఖ ఉన్నతాధికారులకు అత్యవసరంగా లేఖ రాశారు. వన్యమృగం సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక వైల్డ్‌లైఫ్ బృందాలను రంగంలోకి దించి, కెమెరా ట్రాప్‌ల ద్వారా జంతువు కదలికలను గుర్తించి సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించాలని, ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను కోరారు. అలాగే వన్యమృగాల దాడుల్లో పశువులను కోల్పోయిన బాధిత రైతులకు నిబంధనల ప్రకారం తక్షణ పరిహారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన డా. ఈశ్వరప్ప స్థానిక రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతను నేరుగా గమనించిన బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్ప ఈ అంశాన్ని ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. వన్యమృగం సంచారంతో భయాందోళనకు గురవుతున్న రైతులు, ప్రజలకు అటవీశాఖ అధికారులు భద్రతపై భరోసా కల్పించాలని, వన్యమృగం కదలికలను గుర్తించేందుకు నిఘాను మరింత పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

# పెద్దమారూర్ గ్రామంలో మహా అన్నదానం

## - సందడిగా అన్నప్రసాద వితరణ





**చిన్నంబావి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో బొడ్రాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుని మండపం వద్ద ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు మహా ప్రసాద వితరణ అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా బొడ్రాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో సభ్యులు అనుకలి శివరాముడు మాట్లాడుతూ.. గణపతి ఆశీస్సులతో గ్రామంలో ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరుగుతున్నాయని, ప్రతి ఏటా భక్తుల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి గణేష్ యూత్ మండలి నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్య పరీక్షలు

**ఆలంపూర్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆరోగ్య పాఠశాల అనే కార్యక్రమంలో భాగంగా గురువారం అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ మరియు హిమో గ్లోబిన్ శాతం పరీక్షలు చేయడం జరిగింది మరియు కంటికి సంబంధించిన జబ్బులు తర్వాత పంటి సమస్యలు బాలికలకు రుతుస్రావ సంబంధిత సమస్యలను చికిత్స చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పి ఎస్ సి సిబ్బంది మరియు ఆర్ బి ఎస్ కే సిబ్బంది ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది




# చిన్నంబావిలో వర్షాల జోరు.. రైతుల్లో కొత్త ఆశలు

(ఎండలతో వాడిన పంటలకు వాన వరం.. రైతుల్లో ఆనందం

(కురిసిన వాన.. రైతుల కష్టాలకు ఊరట

**చిన్నంబావి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి)**








వర్షాల కోసం ఎదురుచూస్తున్న చిన్నంబావి మండల రైతులకు రెండు రోజులుగా కురుస్తున్న వానలు ఊరటనిచ్చాయి. ఎండలతో పంటలు వాడిపోతుండటంతో ఆందోళనలో ఉన్న రైతులు తాజా వర్షాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో నీరు చేరి మొక్కజొన్న, ఉల్లి, వేరుశెనగ, కంది పంటలకు తేమ అందింది. అరకొర నీటి వసతితో సాగు చేసిన వరి, మిరప పంటలకు కూడా వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వర్షాలు మరికొంతకాలం ఇలాగే కొనసాగితే పంటలు కోలుకుని దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు, కాలువలు పొంగి ప్రవహించడంతో మండలంలో వర్షం తీవ్రత కనిపించింది. మరోవైపు లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలతో ఎండ వేడి తగ్గి వాతావరణం చల్లబడింది.

# అయిజ ఎంపీడీవో గా గడ్డం కృష్ణయ్య



**ఆలంపూర్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ఎంపిడీవోగా గడ్డం కృష్ణయ్య బాధ్యతలు గురువారం చేపట్టారు. సిద్దిపేట జిల్లా, కోహెడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై అయిజకు వచ్చారు. ఆయన బాధ్యతలు తీసుకున్నారు...

# విబిజి రాంజీ పథకం పనుల గుర్తింపునకు పకడ్బందీ ప్రణాళిక అవసరం అదనపు కలెక్టర్ నర్సింగరావు

## - జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**గద్వాల సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో విబిజి రాంజీ పథకం కింద జల సంరక్షణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు.కరువు పరిస్థితుల్లో కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించడంతోపాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరే పనులను చేపట్టాలని అన్నారు.పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆలంపూర్ నియోజకవర్గ సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు,సంబంధిత అధికారులకు వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.విబిజి రాంజీ పథకం కింద గ్రామపంచాయతీ కార్యాలయాలు,ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు,అంగన్‌వాడీ కేంద్రాలు,గ్రామైక్య సంఘాల భవనాలు,పశువుల షెడ్లు తదితర అవసరమైన నిర్మాణ పనులకు కూడా ప్రతిపాదనలు రూపొందించవచ్చని తెలిపారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఇంకుడు గుంతలు,పంట కుంటల నిర్మాణం చేపడుతున్నప్పటికీ,ఆశించిన ఫలితాలు సాధించాలంటే ప్రతి ఇంటితోపాటు ప్రతి రైతు పొలంలోనూ వీటిని నిర్మించుకునేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు విబిజి రాంజీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించి,అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో చర్చించి ఆమోదం పొందాలని సూచించారు.ఎంపీడీవోలు,ఎంపీవోలు సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఈ నెల 25న తమ మండల పరిధిలోని ఒక గ్రామాన్ని సందర్శించి,శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామస్థులు,ప్రజాప్రతినిధులతో చర్చించాలని ఆదేశించారు.ఈ నెల 28 నుంచి అక్టోబర్ 1వ,తేదీ వరకు అన్ని గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, గ్రామసభ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,విబిజి రాంజీ పథకం సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో గణనీయమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.కరువు పరిస్థితుల్లో ప్రజలకు ఉపాధి కల్పించేందుకు విబిజి రాంజీ పథకం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.తాత్కాలిక ప్రయోజనాలకంటే దీర్ఘకాలిక ఫలితాలను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణ,గ్రామీణాభివృద్ధి పనులను చేపట్టాలని,పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ ముషాహిదా బేగం,డీపీఓ శ్రీకాంత్, డీఏఓ వీరప్ప,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు

మల్దకల్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):




ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్-ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాలంటీర్లు కళాశాల ఆవరణలోని ముళ్లపొదలు,చెత్తాచెదారాన్ని శ్రమదానం ద్వారా తొలగించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్ మాట్లాడుతూ,ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ,యువతలో సమాజ సేవా భావాన్ని పెంపొందించేందుకు 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు."నాకోసం కాదు మన కోసం"అనే నినాదంతో ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని, సమాజ సేవ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు,నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.ఎన్ఎస్ఎస్‌లో భాగంగా రెగ్యులర్ కార్యక్రమాలతో పాటు ప్రత్యేక శీతాకాల శిబిరాలు నిర్వహించి గ్రామాల్లో మూఢనమ్మకాలు,బాల కార్మిక వ్యవస్థ,వివిధవ్యాధులు, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులకు జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించడంతో పాటు ఉన్నత విద్యలో 3 శాతం




రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని వివరించారు.విద్యార్థుల్లో నాయకత్వ, సాంస్కృతిక లక్షణాలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్లు,కళాశాల ప్రిన్సిపాల్,చైర్మన్‌లను శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ నరసింహులు,అధ్యాపకులు భాగ్యలక్ష్మి,గోవర్ధన్ శెట్టి,మాధురి,శ్రీకాంత్,సుధాకర్,రాఘవేంద్ర,ఈస్తికర్,కమలహాసన్, అధ్యాపక సిబ్బంది హనుమంతు,శ్రీనివాస్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 24:


ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటి యూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, కార్యదర్శి వీవీ నరసింహ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట స్వీపర్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. వేతనాలను కార్మికుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని,ఏడాది మొత్తం వేతనం చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు.






# పెద్ద చింతరేవులలో నేడు అనంత పద్మనాభ స్వామి వ్రతం

గద్వాల సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):









జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో ఈ నెల 25న శుక్రవారం అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.గ్రామంలోని 15వ,శతాబ్దానికి చెందిన అంజయ్య స్వామి ఆలయ ఆవరణలోని పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ సత్రంలో ఉడిపి పాలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు,శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేక పూజలు, మూల రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఈ నెల 26న శనివారం పౌర్ణమి వేడుకలను ఉడిపి వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం మధ్యాహ్నం వరకు చాతుర్మాస దీక్షల ముగింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.కార్యక్రమానికి హాజరయ్యే భక్తులందరికీ పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని అర్చకులు కోరారు.మరిన్ని వివరాలకు: 9959251123,9949789241,9440770020 నంబర్లలో సంప్రదించవచ్చు.

# అలంపూర్ రైతులకు శుభవార్త

## మల్లమ్మకుంట, సాగునీటి సమస్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ సుదీర్ఘ చర్చ

## రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు..

అలంపూర్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అలంపూర్, నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలు, మల్లమ్మకుంటకు సంబంధించిన అంశాలపై సుమారు గంటపాటు సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా మల్లమ్మకుంట భూ సేకరణ అంశంపై జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం కావాలని ఆదేశాలు జారీ కావాలని మల్లమ్మ కుంట రైతులందరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు మీ భూమి రేటు కూడా లోటు లేకుండా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఆర్డీఎస్, జూరాల పరిధిలోని రైతుల సాగునీటి సమస్యలను డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి, సీనియర్ ఐఏఎస్ అధికారి, ల్యాండ్ అక్విజిషన్ కమిషనర్ శివకుమార్ నాయుడుకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించినట్లు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషా తో చరవాణిలో వెల్లడించారు ఈ విషయాన్ని మీడియా ప్రజాప్రతినిధులకు చరవాణి ద్వారా అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ వివరించారు. సంబంధిత ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆర్డీఎస్, జూరాల పరిధిలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వెంటనే స్పందించినతెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై అలంపూర్, గద్వాల నియోజకవర్గాల రైతులు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ కి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



# కొత్త పోస్టింగ్..
# వెంటనే విధుల్లో చేరాల్సిందే!

**- విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులపై అదనపు కలెక్టర్ సమీక్ష**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులు వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ ఆదేశించారు. కొత్తగా పోస్టింగ్ పొందినప్పటికీ విధుల్లో చేరని ఉపాధ్యాయుల వ్యవహారంపై గురువారం ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఉపాధ్యాయులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త పోస్టింగ్ పొందిన ఉపాధ్యాయులను పాత పాఠశాలల నుంచి వెంటనే రిలీవ్ చేసి, కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చూడాలని ఆదేశించారు.

**రిలీవింగ్.. జాయినింగ్‌లో జాప్యం వద్దు!**

ఉపాధ్యాయుల రిలీవింగ్, జాయినింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పరిపాలనా ప్రక్రియ కారణంగా విద్యార్థులకు బోధనా సేవల్లో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పి. మధుసూదన్ నాయక్ ఆదేశించారు. 81 మంది ఉపాధ్యాయుల విషయంలో ఇక ఆలస్యం లేకుండా.. కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.



# ఎంబీబీఎస్ సీటు సాధించిన కొద్ది రోజులకే పావని మృతి

**చిన్న వయసులోనే మృత్యువు ఒడిలోకి..**

**కుటుంబంలో తీవ్ర విషాదం**

**ఆలంపూర్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మున్సిపాలిటీ 9వ వార్డు మాలపేట కాలనీకి చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కుమార్తె మాల పావని (20) గురువారం సాయంత్రం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. కష్టపడి చదివి ఇటీవలే ఎంబీ.బీఎస్ సీటు సాధించిన పావని, వైద్య విద్యలో అడుగుపెట్టి భవిష్యత్తులో డాక్టర్‌గా సేవలందించాలని ఎన్నో కలలు కన్నారు. అయితే ఎంబీ.బీఎస్ సీటు సాధించిన ఆనందం పూర్తిగా కుటుంబంలో నిలవకముందే ఆమె మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**- 27న దుందుభి నది ఒడ్డున ఉల్పార నుంచి కల్వకుర్తి వరకు పాదయాత్ర - అలంపూర్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ వై.రామ్మోహన్ డిమాండ్**

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 24:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి అలంపూర్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ వై.రామ్మోహన్ డిమాండ్ చేశారు.గురువారం మానవపాడు మండల కేంద్రంలో స్థానిక రైతులతో కలిసి కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో పాదయాత్రకు సంబంధించిన కరపత్రికనుఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటే పిఆర్ ఎల్ఐ నీటిని నల్గొండకు తరలించే దిండి లిఫ్ట్ పథకాన్ని రద్దు చేయాలని,ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల నుంచి ఉండవల్లి, మానోపాడు,అలంపూర్ మండలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న దుందుబి నది ఒడ్డున ఉన్న ఉల్పార నుంచి కల్వకుర్తి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇష్టంగా పోరాడుదాం.మన వాటా మనం సాధించుకుందాం'అనే నినాదంతో చేపట్టే పాదయాత్రను రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.చంద్రసాగర్, అమ్రాబాద్,జూరాల, గట్టు,శేర్పల్లి ప్రాంతాల్లో లిఫ్ట్ పథకాలు నిర్మించాలని,జీవో 72తో తంగడి లిఫ్ట్ పథకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్,వెల్టూరు, గొందిమల్ల బ్యారేజీలను నిర్మించాలని చిన్నోనుపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాలువకు సాగునీరు అందించాలని,99,100 ప్యాకేజీలను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి,నాయకులు రైతులు దుబ్బన్న నాగరాజు,జగ్గుల శ్రీనివాసులు,సర్దార్, ప్రకాశం,బీచుపల్లి, రామన్న,మద్దిలేటి, రాజు,రాజశేఖర్, గిడ్డన్న తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

## - పీహెచ్సీలు, సీహెచ్సి లు, సబ్‌సెంటర్లపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీహెచ్సీలు, సీహెచ్సిల వైద్యాధికారులు, టీబీ, కుష్టు, ఎన్సిడీ, ఎంహెచెన్, ఆర్బీస్కే తదితర కార్యక్రమాల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో మందుల లభ్యత, వైద్య సిబ్బంది విధుల నిర్వహణ, ఏం ఎల్ హెచ్ పి లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, స్వీపర్లు, ఇతర కంటింజెన్సీ సిబ్బంది అంశాలను కలెక్టర్ సమీక్షించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.



గుండె సంబంధిత వ్యాధులు తదితర ఎన్సిడి లను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు.

### మందుల కొరత లేకుండా ముందస్తు చర్యలు:

ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత రాకుండా ముందుగానే ఇండెంట్లు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సరఫరాలో జాప్యం జరిగితే కారణాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని తెలిపారు. ప్రతి నెల 15, 30 తేదీల్లో మందుల ఇండెంట్‌లు, సరఫరా పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న మందుల వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపైనా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

### రోగుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది విధులు:

పీహెచ్సీ ల్లో రోగుల రద్దీని పరిగణనలోకి తీసుకుని సిబ్బంది విధులను పునర్వ్యవస్థీకరించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోగుల రద్దీని పరిశీలించి అవసరానికి అనుగుణంగా షిఫ్టులు రూపొందించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ముందుగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, నిజమైన కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

### సబ్‌సెంటర్లపై ప్రత్యేక పర్యవేక్షణ :

సబ్‌సెంటర్లలో ఏం ఎల్ హెచ్ పి లు నిర్దేశిత రోజుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి, మూడవ వారాల్లో గురువారాలను ప్రత్యేక సమీక్ష, ఫీల్డ్ కార్యక్రమాలకు కేటాయించి, మిగిలిన రోజుల్లో సబ్‌సెంటర్లలో ప్రజలకు వైద్య సేవలు అందేలా విధులను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రతి పీహెచ్సీ వైద్యాధికారి తన పరిధిలోని సబ్‌సెంటర్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### ఎన్సిడీ స్క్రీనింగ్ వేగవంతం చేయాలి:

గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌సెంటర్ల పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ఫాగింగ్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలకు గ్రామాల వారీగా, ఆశా వారీగా లక్ష్యాలు నిర్దేశించి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు తదితర ఎన్సిడి లను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు.

### హెచ్ పి వి టీకాపై అవగాహన

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన బాలికలకు హెచ్ పి వి టీకాపై అవగాహన కల్పించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా టీకా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్బీస్కే ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించారు. హెచ్ ఎం ఐ ఎస్ లో టిబి కేసుల నమోదు, చిన్నారుల టీకా కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య స్క్రీనింగ్, ఎంహెచ్ ఎన్ కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను పీహెచ్సీ ల వారీగా పరిశీలించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, కుష్టు, టిబి కేసుల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల పురోగతి, సబ్‌సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతుల పనుల పరిస్థితిపైనా సమీక్ష నిర్వహించారు.

### సమస్యలను గుర్తించి పరిష్కరించాలి:

ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రతి వైద్యాధికారి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా వైద్యాధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి, పీహెచ్సీ, సీహెచ్సి ల వైద్యాధికారులు, ప్రాజెక్టు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై పోలీసుల దాడి దుర్మార్గం

## - అత్తాపూర్ ఘటనపై పాలమూరు బార్ అసోసియేషన్ నిరసన




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో న్యాయవాదులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఖండిస్తూ పాలమూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ రావు మాట్లాడుతూ.. ఎన్ని చట్టాలు, నిబంధనలు వచ్చినా న్యాయవాదులపై దాడులు జరుగుతుండటం ఆందోళనకరమన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు తమ విధుల్లో భాగంగా వివిధ సందర్భాల్లో పోలీస్ స్టేషన్లను, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపారు. న్యాయవాదులకు అవసరమైన సందర్భాల్లో ప్రత్యేక రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదిపై దాడి వెనుక ఎంతటి వ్యక్తులు ఉన్నా, రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆనంద్ రావు డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా మహిళా న్యాయవాదిపై పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి బాధిత న్యాయవాదులకు న్యాయం చేయాలని కోరారు. న్యాయవాదులపై దాడులకు అడ్డుకట్ట వేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బుల నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు చంద్రమౌళి, ఎన్.పీ. వెంకటేష్, నరేందర్ గౌడ్, పరమేష్ గౌడ్, లక్ష్మారెడ్డి, బ్రహ్మయ్య, తగిలి కృష్ణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకోండి.. ఉన్నత శిఖరాలను అధిరోహించండి

## - ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా






**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకాంక్షించారు.జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం సాయంత్రం కలెక్టర్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని సూచించారు.కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించడంతో పాటు జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు పూర్తయ్యే నాటికి సంబంధిత అంశాలపై పూర్తి అవగాహన, పరిజ్ఞానం సంపాదించుకుని పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం కావాలని సూచించారు.

**అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలి:**

స్టడీ సర్కిల్ అందిస్తున్న బోధనా వనరులు, స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ స్టడీ సర్కిల్ సెక్రటరీ డీడీ సునీత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్, సిబ్బంది, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

## - ప్రేమ, ఆప్యాయతతో చూసుకోవాలి..

### వారి హక్కులు, గౌరవాన్ని కాపాడాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా ప్రేమ, ఆప్యాయతతో చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చట్టరీత్యా శిక్షార్హమని, వారి సంరక్షణ, గౌరవం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం గోడపత్రికను గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వయోవృద్ధులకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని, వారికి భద్రతతో కూడిన గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు సహకరించాలని కోరారు.

**వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం:**

వృద్ధుల హక్కులు, సంక్షేమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వయస్సు పైబడిన తల్లిదండ్రులు, కుటుంబంలోని వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయడం లేదా వారి సంరక్షణ పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. వృద్ధుల భద్రత, గౌరవం, సంక్షేమానికి కుటుంబ సభ్యులు, సమాజం సహకరించాలని కోరారు.వృద్ధాప్యం భారంగా కాదు.. అనుభవానికి ప్రతీక. వారిని ప్రేమతో, గౌరవంతో చూసుకోవడం కుటుంబ బాధ్యత మాత్రమే కాదు.. సమాజ బాధ్యత కూడా అని కలెక్టర్ సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జీడీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, అదనపు డీఎంహెచ్‌ఓ శశికాంత్, డీఐఓ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

## - నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం.. ఈ నెల 30లోగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు సిద్ధం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి గ్రామ పంచాయతీ వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడే వర్షాభావం, నీటి కొరతను ముందుగానే అంచనా వేసి ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించాలని, గ్రామాల్లో నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు.వి.బి.జి. రామ్‌జీ పనుల కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై బాలానగర్, హన్వాడ, గండీడ్, మహబూబ్‌నగర్, మహమ్మదాబాద్, మిడ్జిల్, నవాబ్‌పేట్ మండలాల సర్పంచులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టరేట్‌లో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**అక్టోబర్ 2న గ్రామసభల్లో ఆమోదం:**

అక్టోబర్ 1, 2026 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రణాళికలను ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం పనులను అమలు చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

**నీటి భద్రతకు ప్రాధాన్యం:**

వర్షపాతం అస్థిరత, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలపై పడే ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్లు వంటి పనులను అవసరమైన ప్రాంతాల్లో చేపట్టాలని తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను ప్రణాళికల్లో భాగం చేయాలని సూచించారు.

**నాలుగు ప్రధాన రంగాలపై దృష్టి:**

వి.బి.జి. రామ్‌జీ ప్రణాళికల్లో నీటి సంరక్షణ, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణ అనే నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాల భవనాలు, ప్రహరీ గోడలు, అంగన్‌వాడీ భవనాలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు వంటి గ్రామాల మౌలిక అవసరాలను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని సూచించారు.ఫామ్ పాండ్లను నీటి నిల్వకు మాత్రమే పరిమితం చేయకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చేపల పెంపకం, పశుపోషణ వంటి జీవనోపాధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.అధిక వర్షాల సమయంలో వరదలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కాలువలు, చెరువులు, కుంటలు, ఫీల్డ్ ఛానళ్ల అభివృద్ధికి అవసరమైన పనులను ముందుగానే గుర్తించాలని సూచించారు.

**ప్రతి గ్రామానికి ప్రత్యేక ప్రణాళిక:**

ప్రతి గ్రామానికి ఒకే తరహా ప్రణాళిక కాకుండా ఆయా గ్రామాల భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలు, వర్షాభావ ప్రభావం, ప్రజల సమస్యలకు అనుగుణంగా పనులను ఎంపిక చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జీపీడీపీ, జి ఐ ఎస్ ఏ పి తదితర ప్రణాళికల్లో ఇప్పటికే గుర్తించిన పనులతో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను అనుసంధానం చేసి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రణాళికకు ముందు బేస్‌లైన్ డేటా, సోషల్ మ్యాపింగ్, రిసోర్స్ మ్యాపింగ్ నిర్వహించాలని తెలిపారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, చెరువులు, కుంటలు, కాలువలు, ఎత్తైన, లోతట్టు ప్రాంతాలను మ్యాప్‌లో గుర్తించి అవసరమైన అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు.

**మూడేళ్ల దీర్ఘకాలిక ప్రణాళిక :**

2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులతో పాటు తదుపరి మూడు సంవత్సరాలకు సంబంధించిన దీర్ఘకాలిక ప్రణాళికను కూడా రూపొందించాలని కలెక్టర్ తెలిపారు.ప్రణాళికలు కేవలం అధికారిక ప్రక్రియగా కాకుండా గ్రామాల వాస్తవ అవసరాలకు అనుగుణంగా, కొలిచే ఫలితాలు వచ్చేలా ఉండాలని సూచించారు. నీటి సంరక్షణ, వర్షాభావ నివారణ పనుల్లో ప్రజలు, రైతులను భాగస్వాములను చేయాలని సర్పంచులకు సూచించారు.మంచి పనితీరు కనబరిచే గ్రామ పంచాయతీలను గుర్తించి ప్రోత్సహిస్తామని, ఉత్తమంగా పనిచేసే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.





**సమన్వయంతో ముందుకు సాగాలి:**

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో గ్రామాభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించి అవసరమైన తీర్మానాలు చేయాలని తెలిపారు.ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టే విధానాలపై అవగాహన కల్పించడమే శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఏ.ఐ.కే.ఎం.ఎస్ జాతీయ మహాసభలకు తరలిరండి

- గద్వాల జిల్లా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ

**ఆలంపూర్ సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఈ నెల 28, 29, 30 తేదీలలో ఖమ్మం నగరంలో జరగనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జమ్మిచెడు కార్తీక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు అదేవిధంగారైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు, కూలీలు తిప్పిగొట్టారని అన్నారు. రైతు హక్కుల కోసం పోరాడుతున్న ఏ .ఐ. కే ఎం .ఎస్ మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సుధాకర్ పౌలరాజ్ విష్ణు విజయ్ శివారెడ్డి మధు పవన్ భీమేష్ పర్ష శివశంకర్ భీమేష్ భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు




# లక్కర్దొడ్డిలో శుద్ధి నీటి వాటర్ ట్యాంక్ నిర్మాణ భూమి పూజ

**నర్వ సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అన్న, ఆదేశాల మేరకు. హెచ్డిఎఫ్సి పరివర్తన్ వారి సౌజన్యంతో రామ్‌కీ సంస్థల ఆధ్వర్యంలో.మక్తల్ నియోజకవర్గం: నర్వ మండలం లక్కర్దొడ్డి గ్రామంలో నూతన ఫిల్టర్ వాటర్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి గారు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ , లక్కర్ దొడ్డి గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న,ఉపసర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప్ప ,రామ్‌కీ సంస్థ అధికారులు విజయ్ కుమార్ గారు, వెంకటేశ్వర్ రెడ్డి గారు,పంచాయతీ కార్యదర్శి రాజు నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి అశోక్ గౌడ్ గ, నర్వ గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు, బోయపాటి నరసింహ వార్డు సభ్యులు తిరుపతయ్య, జయమ్మ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద మల్లేష్, సాగర్ హనుమంతు, పెద్ద నరసింహ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బీచు పల్లి గురుకుల విద్యార్థులకు డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం నిర్వహించారు

**ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి)సెప్టెంబర్ 24:**

గద్వాల డిఎంహెచ్వో సంధ్యా కిరణ్ మై,ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇటిక్యాల డాక్టర్ రాధిక బీచుపల్లి సబ్ సెంటర్ ఏఎన్ఎమ్స్ లక్ష్మీదేవి,అనిత, సూపర్వైజర్స్ శ్రీనివాసులు హెల్త్ అసిస్టెంట్,ఆశాలు కలిసి బీచుపల్లి గురుకుల పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థికి ఆరోగ్య పరిక్షలు చేయడం జరిగినది. 59 మంది విద్యార్థులకు ఆరోగ్య పరిక్షలు చేసి హెల్త్ కార్డులను పంపిణీ చేయడం జరిగినది. ఈ ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో బీచుపల్లి సర్పంచ్ విజితా రెడ్డి, కార్యక్రమంను ప్రారంభించడం జరిగినది మరియు కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్,టీచర్స్ విద్యార్థులందరికీ రక్త పరీక్షలు జరిపి వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి మందులను పంపిణీ చేయడం జరిగినది. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు తెలపడం జరిగింది.





# బీరం లక్ష్మారెడ్డికి ఘన నివాళులు

- హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబానికి కొప్పునూరు బీఆర్ఎస్ నేతల సానుభూతి

**చిన్నంబావి,సెప్టెంబర్ 24**

**(ప్రజా జ్యోతి)**



పితృవియోగంతో బాధలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కొప్పునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. సింగోటం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీ.శే. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీరం లక్ష్మారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మృతి కుటుంబ సభ్యులకే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు తగరం లక్ష్మి కురుమయ్య, మండల సీనియర్ నాయకులు ఉలుపాల మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కురుమయ్య, సొసైటీ డైరెక్టర్ డేగ శేఖర్‌యాదవ్, వార్డు సభ్యులు బిజనములో జగదీష్, బడికల సత్తి, కొట్టే స్వాములు, డ్రైవర్ కురుమయ్య, గుడిసె కురుమయ్య, బోర్గా ఆంజనేయులు, ఉదయ్‌కుమార్, బూర్గుల బాలు, మధు, పసుల రాజు, బూరుగుల సురేష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో షార్ట్ సర్క్యూట్.. ఇంట్లో అగ్నిప్రమాదం

## - రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం.. బాధిత ఇంటిని పరిశీలించిన అధికారులు





**చిన్నంబావి, సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో సంపంగి ఈశ్వర్ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పిడుగుపాటే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. పిడుగు ఇంటిపై కప్పుపై పడటంతో విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్నది. ఆ ప్రభావంతో విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని విద్యుత్ పరికరాలు, గృహోపకరణాలు దెబ్బతిన్నాయి.ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తే.. మొదట పిడుగు ఇంటిపై కప్పుపై పడింది. పిడుగుపాటు ధాటికి ఇంటి విద్యుత్ వ్యవస్థపై ప్రభావం పడింది. దీని ఫలితంగా విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రికి వ్యాపించాయి. అంటే పిడుగుపాటు ప్రత్యక్షంగా మంటలకు కారణం కాకుండా.. దాని ప్రభావంతో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ అగ్నిప్రమాదానికి కారణమైనట్లు స్థానికులు తెలిపారు.విద్యుత్ పరికరాలు ధ్వంసం మంటల కారణంగా ఇంట్లోని కూలర్, వాషింగ్ మెషిన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు,గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, మీటర్ పైభాగం కాలిపోయాయి. మంటలు, పొగతో ఇంటి గోడలు నల్లగా మారాయి. ఇంటికి పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.రూ. 3 లక్షల వరకు నష్టం అగ్నిప్రమాదం కారణంగా ఇంట్లోని పలు వస్తువులు దెబ్బతినడంతో సుమారు రూ. 3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సంపంగి ఈశ్వర్ తెలిపాడు. అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాదంతో కుటుంబం తీవ్రంగా నష్టపోయింది.ఇంటిని పరిశీలించిన అధికారులుప్రమాద విషయం తెలుసుకున్న ఉమ్మడి మండలాల మాజీ జడ్పీటీసీ ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం మండల ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పాక్షికంగా దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, జరిగిన ఆస్తి నష్టంపై వివరాలు తెలుసుకున్నారు.పరిహారం అందించాలని కోరుతున్న బాధిత కుటుంబంపిడుగుపాటు వల్ల విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడం.. ఆ తర్వాత షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం జరగడంతో ఇంట్లోని సామగ్రి భారీగా దెబ్బతిందని బాధిత కుటుంబం తెలిపింది. అధికారులు నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి, నిబంధనల ప్రకారం ప్రభుత్వ సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గండీడ్ మండలంలో ఉపాధ్యాయుల ఘన సన్మానం

## టి.ఎస్.సి.పి.ఎస్.ఈయూ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**గండీడ్, (ప్రజా జ్యోతి):**

గండీడ్ మండల కేంద్రంలో ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు, టి.ఎస్.సి.పి.ఎస్.ఈయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మంది ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రుద్రారం జనార్ధన్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానం ఉందని, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించి వారిని సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకోవడం తమ బాధ్యతను మరింత పెంచిందని అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన టి.ఎస్.సి.పి.ఎస్.ఈయూ గండీడ్ మండల నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దోమ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంబాద్ కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రాఘవేంద్రరావు, రామానుజం వ్యవహరించారు.కార్యక్రమంలో టి.ఎస్.సి.పి.ఎస్.ఈయూ జిల్లా అధ్యక్షుడు కే.ఎం. చంద్రకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, రాధిక, నాయకులు యాదయ్య గౌడ్, పి.ఆర్.టి.యు.టి.ఎస్ మండల అధ్యక్షుడు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టి.ఎస్.యు.టి.ఎఫ్ మండల అధ్యక్షుడు గంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, పి.ఆర్.టి.యు తెలంగాణ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, టి.జి.యు.ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, సి.పి.ఎస్ మాజీ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి అశోక్ బాబు, హన్వాడ మండల సి.పి.ఎస్ అధ్యక్షుడు కురుమయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.






# గణేష్ నిమజ్జనం సందర్భంగా నేడు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మద్యం దుకాణాలు బంద్

## - అలంపూర్,అయిజ, గద్వాల,వడ్డేపల్లి మున్సిపాలిటీలలో, ఎర్రవల్లి లో వైన్‌షాపులు,బార్లు, కల్లు దుకాణాల మూసివేతకు కలెక్టర్ ఆదేశాలు

## - ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చర్యలు

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 24:**

జోగులాంబ గద్వాల జిల్లాలో గణేష్ నవరాత్రుల ముగింపు సందర్భంగా తేది.25.09.2026 శుక్రవారం నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జనాలను ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్,ఆదేశాల మేరకు శుక్రవారం తేది 25.09.2026 ఉదయం 06 గంటల నుండి తేది. 26.09.2026 ఉదయం 06 గంటల వరకు గద్వాల,అయిజ, వడ్డేపల్లి,అలంపూర్ ఈ నాలుగు మున్సిపాలిటీలతో పాటు ఎర్రవల్లిలో కూడా వైన్‌షాపులు,బార్లు, కల్లు దుకాణాలు పూర్తిగామూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, తెలిపారు.శుక్రవారం గణేష్ నవరాత్రులలో చివరి రోజు గణేష్ విగ్రహాల నిమజ్జన, ఊరేగింపులు జరగనున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలు, భద్రత,శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలోని మద్యం దుకాణాల నిర్వాహకులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని,నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయాలు నిర్వహించినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలుతీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.గణేష్ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి,సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.





